సాక్షి
ప్రకాశం

సోమవారం । 26 । ఫిబ్రవరి । 2024



కార్యకర్తల రుణం తీర్చుకుంటాం

వచ్చే ఎన్నికల్లో గెలిచి కార్యకర్తల రుణం తీర్చుకుంటానని ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. మార్కాపురం మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. - 8లో..



జగనన్న పాలన సంక్షేమ రాజ్యం

జగనన్న పాలనలో రాష్ట్రం సంక్షేమ రాజ్యంగా ఉందని నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/26

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

ఎంపీజే రాష్ట్ర అధ్యక్షునిగా అబ్దుల్ రజాక్



మాట్లాడుతున్న అబ్దుల్ రజాక్ (బాబు)

మార్కాపురం టౌన్: ఎంపీజే (మూవ్‌మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్) రాష్ట్ర అధ్యక్షునిగా ప్రస్తుత ప్రధాన కార్యదర్శిగా ఉన్న మార్కాపురం పట్టణానికి చెందిన ఎస్‌కే అబ్దుల్ రజాక్ (బాబు) ఎన్నికయ్యారు. ఎంపీజే ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలాగా పనిచేస్తుందని రజాక్ తెలిపారు. ఆదివారం విజయవాడలో జరిగిన సమావేశంలో తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని చెప్పారు. బాబు సోదరుడు ఎస్‌కే ఇస్మాయిల్ ప్రస్తుత వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షునిగా, మున్సిపల్ వైస్ చైర్మన్‌గా ఉన్నారు.

నేడు రైల్వేస్టేషన్ల అభివృద్ధికి శ్రీకారం

- అభివృద్ధి పనులను వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని



మార్కాపురం రైల్వే స్టేషన్

మార్కాపురం: పశ్చిమ ప్రకాశంలోని మార్కాపురం, కంభం, గిద్దలూరు రైల్వేస్టేషన్లలో అభివృద్ధి పనులకు ప్రధాని నరేంద్రమోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నట్లు గుంటూరు రైల్వే డీఆర్‌యూసీసీ సభ్యులు ఆర్‌కేజే నర్సింహం తెలిపారు. మార్కాపురం రైల్వే స్టేషన్‌లో రూ.21.50 కోట్లు, కంభం రైల్వే స్టేషన్‌కు రూ.11.72, గిద్దలూరు రైల్వేస్టేషన్‌కు రూ.11.72 కోట్ల నిధులు కేటాయించారు. ఇందులో భాగంగా ప్రయాణికులకు వెయిటింగ్ హాలు, ప్లాట్‌ఫాం విస్తరణ, డిజిటల్ బోర్డులు, దివ్యాంగులకు ఇబ్బందులు లేకుండా లిఫ్టులు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గుంటూరు రీజియన్ పరిధిలోని మాచర్ల, మంగళగిరి రైల్వేస్టేషన్లలో కూడా అభివృద్ధి పనులు జరగనున్నాయి. మార్కాపురం రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజు సగటున 3,295 మంది ప్యాసింజర్లు ప్రయాణిస్తున్నట్లు, కంభం రైల్వే స్టేషన్ ద్వారా 1895 మంది, గిద్దలూరు రైల్వేస్టేషన్ ద్వారా 2917 మంది ప్రయాణిస్తున్నట్లు తెలిపారు.

పారదర్శకంగా సహకారం

ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు (పీఏసీఎస్‌లు) సాంకేతిక హంగులను అద్దుకుంటున్నాయి. పీఏసీఏస్ లలో లావాదేవీలు పారదర్శకంగా ఉండేందుకు కంప్యూటరీకరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రూ.3.91 కోట్లతో చురుగ్గా పని జరుగుతోంది. మొత్తం లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే చేపడతారు. పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణతో గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి.

- సాంకేతిక హంగులు దిద్దుకుంటున్న పీఏసీఎస్‌లు
- రూ.3.91 కోట్లతో పీఏసీఎస్‌లు కంప్యూటరీకరణ
- ఈ ఏడాది మార్చి చివరికి పూర్తి చేసేందుకు చర్యలు
- పీఏసీఎస్‌ల లావాదేవీలు ఇక భద్రం



ప్రకాశం జిల్లా కేంద్ర సహకార బ్యాంకు కార్యాలయం

ఒంగోలు సిటీ: తెలుగుదేశం పార్టీ హయాంలో సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తే, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార రంగాన్ని బలోపేతం చేయడమే కాకుండా బహుళ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కృషి చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మొత్తం 176 పీఏసీఎస్‌లుండగా అందులో 172 పీఏసీఎస్ లకు ఫైనాన్సును అందిస్తున్నాయి. 4 పీఏసీఎస్‌లు కమర్షియల్ బ్యాంకులుగా ఉన్నాయి. గత ప్రభుత్వంలో కొన్ని సొసైటీలలో రుణాలకు సంబంధించి రైతులకు సరైన రసీదులు ఇవ్వకపోవడంతో విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో లావాదేవీల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు కంప్యూటరీకరణ ప్రక్రియ చేపట్టారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దాదాపు 3 లక్షల మంది సభ్యులున్నా 2 లక్షల సభ్యులు మాత్రమే రుణాలు తీసుకోవడం, రికవరీ చేస్తున్నారు. ఇటువంటి వారి వివరాలన్నీ కంప్యూటర్లలోకి రానున్నాయి.

మార్చి చివరి నాటికి పూర్తి..

కంప్యూటరీకరణలో భాగంగా ఫస్ట్ హ్యాండ్ రిపోర్టు చేయడం పూర్తయింది. ఇందులో సొసైటీల బేసిక్ డేటాను పొందుపరిచారు. సహకారశాఖ, డీసీసీబీ, పీఏసీఎస్‌లు సంయుక్తంగా ఫీల్డ్ విజిట్ రిపోర్టు పూర్తి చేశాయి. రానున్న రోజుల్లో కంప్యూటరీకరణకు సంబంధించి చట్టబద్ధమైన ఆడిట్ జరగాలి. మాన్యువల్ గా రికార్డుల్లో ఉన్న డేటా మొత్తాన్ని కంప్యూటర్‌లో నమోదు చేయాలి. కంప్యూటరీకరణ చేసిన డేటాను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంది. మొత్తం ప్రక్రియను 2024 మార్చి చివరి నాటికి పూర్తి చేయాలి. కంప్యూటరీకరణ కోసం ఒక్కో పీఏసీఎస్‌లో కేంద్రం, రాష్ట్రం, నాబార్డు కలిసి రూ.4 లక్షలు ఖర్చు చేస్తున్నాయి. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రూ.3.91 కోట్లతో చురుగ్గా పని జరుగుతోంది. కంప్యూటరీకరణకు చేసే వ్యయంలో 60 శాతం కేంద్రం, 30 శాతం రాష్ట్రం, 10 శాతం నాబార్డు భరిస్తున్నాయి

పీఏసీఎస్‌లు బ్యాంకులుగా రూపాంతరం...

కంప్యూటరీకరణతో పీఏసీఎస్‌లు బ్యాంకులుగా రూపాంతరం చెందనున్నాయి. సభ్యులుగా ఉన్న రైతులకు సంఘాల్లోనే ఖాతాలు ప్రారంభిస్తారు. రైతులకు డైరెక్టు బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ (డీబీటీ) ద్వారా అందే ఆర్థిక లబ్ధి కూడా సొసైటీ ఖాతాల్లోనే జమవుతుంది. వ్యవసాయ రుణాలే కాకుండా వ్యాపార రుణాలు కూడా ఇవ్వవచ్చు. మొత్తం లావాదేవీలన్నీ ఆన్‌లైన్‌లోనే చేపట్టడం వల్ల పారదర్శకతకు పెద్దపీట వేసినట్లవుతుంది. పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ వల్ల గ్రామీణ ప్రాంతాలకు బ్యాంకింగ్ సేవలు మరింత అందుబాటులోకి రానున్నాయి.

కామన్ సర్వీస్ సెంటర్లుగా పీఏసీఎస్‌లు:

పీఏసీఎస్‌లు బ్యాంకింగ్ సేవలు అందించడంతో పాటు కామన్ సర్వీస్ సెంటర్లుగా పనిచేస్తున్నాయి. ఒకప్పుడు రైతులకు రుణాలు ఇవ్వడం, రికవరీ చేయడం వరకు మాత్రమే పరిమితమయ్యేవి. కానీ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత పీఏసీఎస్‌లు బహుళ సేవలు అందిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో అడుసుమల్లి, యర్రగొండపాలెం సొసైటీలు పెట్రోలు పంపులు నిర్వహిస్తున్నాయి. అలాగే సొసైటీలకు మల్టీ పర్పస్ గోదాములు కూడా నిర్మిస్తున్నారు. ఇందుకు ఆప్కాబ్, నాబార్డు, డీసీసీబీలు రుణ సదుపాయం కల్పిస్తున్నాయి.

పీఏసీఎస్‌ల్లో జరిగే లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుంది



కంప్యూటరీకరణతో సొసైటీల్లో జరిగే లావాదేవీల్లో పారదర్శకత పెరుగుతుంది. సొసైటీల కంప్యూటరీకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోంది. ఇందు కోసం ప్రతి పీఏసీఎస్‌లలో రూ.4 లక్షలు ఖర్చు చేస్తున్నాం. బ్యాంకుల తరహాలో సొసైటీలు పని చేస్తాయి. ఈ ఏడాది మార్చి చివరిలోగా ఈ ప్రక్రియ పూర్తి చేస్తాం.

– కోటిరెడ్డి, సీఈఓ ప్రకాశం డీసీసీబీ

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార రంగాన్ని బలోపేతం చేస్తున్నారు



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార రంగాన్ని బలోపేతం చేస్తున్నారు. గత ప్రభుత్వం సహకార రంగాన్ని నిర్వీర్యం చేస్తే వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు కేటాయించడమే కాకుండా సహకార రంగాన్ని అభివృద్ధి చేశారు. బహుళ సేవలను అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుంది.

– వై.ఎం.ప్రసాద్‌రెడ్డి, ప్రకాశం పీడీసీసీబీ చైర్మన్

14 ఏళ్లలో చంద్రబాబు చేసిందేమిటో చెప్పాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మంత్రి మేరుగు నాగార్జున

- జగన్‌ను సీఎం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది
- ఒక్కసారి అవకాశం ఇవ్వండి... నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తా
- మంత్రి మేరుగు నాగార్జున
- గురవారెడ్డిపాలెంలో రూ.62 లక్షలతో ఆర్‌బీకే, ఆరోగ్య భవనం, బల్క్‌మిల్క్ సెంటర్లు ప్రారంభం

చీమకుర్తి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన ఐదేళ్లలో రూ.2.60 లక్షల కోట్ల విలువైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందించారు. చంద్రబాబు అధికారంలో ఉన్న 14 ఏళ్లలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమిటో చెప్పాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త మేరుగు నాగార్జున ప్రశ్నించారు. సంతనూతలపాడు మండలం గురవారెడ్డిపాలెంలో ఆదివారం రాత్రి రూ.62 లక్షల విలువైన రైతు భరోసా కేంద్రం, ఆరోగ్య భవనం, బల్క్ మిల్క్ సెంటర్ భవనాలను మంత్రి చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం గురవారెడ్డిపాలెంతో పాటు లక్ష్మీపురంలో స్థానిక వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, నాయకులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలు పేద ప్రజలకు నిరంతరం అందాలంటే మళ్లీ ముఖ్యమంత్రిని చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. 2024 ఎన్నికలను ప్రజలు ప్రతిష్టాత్మకంగా తీసుకుని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మంచి మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సంతనూతలపాడు అసెంబ్లీ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా తనకు ఒక్క అవకాశం ఇచ్చి గెలిపిస్తే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని భరోసా ఇచ్చారు. తొలుత గురవారెడ్డిపాలెం, లక్ష్మీపురం గ్రామాల్లోకి స్థానిక సర్పంచ్‌లు మారెడ్డి విజయలక్ష్మి, మారెడ్డి పవన్ కుమార్, ఎంపీటీసీ కంచి మాధవి, రామానాయుడు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ జెండాలతో ఊరేగింపుగా మంత్రి మేరుగు నాగార్జునను ఘనంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ బీ.విజయ, జెడ్పీటీసీ దుంపా రమణమ్మ, దుంపా యలమందారెడ్డి, స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



హెల్త్‌సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

కొండపిని అభివృద్ధిలో అగ్రస్థానంలో నిలబెడతా



శానంపూడి ఎస్టీ కాలనీలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

- రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి సురేష్

సింగరాయకొండ (మర్రిపూడి): కొండపి నియోజకవర్గాన్ని అభివృద్ధిలో మొదటి స్థానంలో నిలుపుతానని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. సింగరాయకొండ మండలం శానంపూడి గ్రామంలో ఆదివారం రాత్రి 'పల్లె పల్లెకు సురేష్ అన్న సిద్ధం' కార్యక్రమంలో మంత్రి సురేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించి రెండు నెలలు అయిందని, ఈ కాలంలో నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నానన్నారు. అన్ని మండలాల్లో రాబోయే వేసవిని దృష్టిలో పెట్టుకుని మరమ్మతులకు గురైన బోర్లను రిపేరు చేయడంతో పాటు అవసరమైన చోట్ల కొత్త బోర్లు వేయిస్తున్నానన్నారు. తాగునీటి ఎద్దడి లేకుండా కృషి చేస్తున్నానని చెప్పారు. వీధిలైట్ల సమస్య లేకుండా అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫారాలు ఏర్పాటు చేయిస్తున్నానన్నారు. సింగరాయకొండ మండలానికి ప్రధాన సాగునీటి వనరైన పాలేరు–బిట్రగుంట స్కీము సప్లయ్ చానల్ పూడిపోయి చిల్లచెట్లతో నిండిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఛానల్ పూడికతీత పనులు చేయిస్తున్నానని వివరించారు. ఎమ్మెల్యే స్వామి పీబీ ఛానల్ పూడిపోయినా పట్టించుకోకుండా గాలికి వదిలేశాడని విమర్శించారు. నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందాయా లేదా, ఇంకా అందని వారిని గుర్తించి వారికి ప్రభుత్వ పథకాలు వచ్చేలా చేస్తున్నానని వివరించారు. ఇళ్లు లేని నిరుపేదలను గుర్తించి వారికి ఇంటి పట్టా ఇవ్వటమే కాక మూడో ఆప్షన్ ప్రకారం ఇళ్లు కూడా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు.

యువతకు జాబ్ మేళా:

చదువుకున్న, నైపుణ్యం గల యువతకు జాబ్‌మేళా నిర్వహించి వారికి ఉపాధి, జీవన ప్రమాణాలు పెంచేందుకు మార్చి 5వ తేదీలోగా నియోజకవర్గంలో జాబ్‌మేళా నిర్వహిస్తానని మంత్రి సురేష్ హామీ ఇచ్చారు. ఈ జాబ్‌మేళాను 50 నుంచి 75 కంపెనీలతో నిర్వహించి 500 నుంచి 700 వరకు ఉద్యోగాలు వచ్చేలా చేస్తానన్నారు. నియోజకవర్గంలో 40 మందికి సుమారు రూ.47 లక్షల విలువైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇచ్చానని వివరించారు.

సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతా:

సింగరాయకొండ మండల కేంద్రాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతానని మంత్రి సురేష్ హామీ ఇచ్చారు. మండల కేంద్రంలో ప్రధాన రహదారిలో సెంట్రల్ లైటింగ్ సిస్టంను ఆధునికీకరిస్తానని, డస్ట్ మిషన్లు తీసుకుని రోడ్ల పై దుమ్ములేకుండా చేస్తానన్నారు. అలాగే నియోజకవర్గంలో గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయిస్తానని చెప్పారు.

టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలోకి 10 కుటుంబాలు చేరిక:

టీడీపీ నాయకుల ప్రలోభాలతో ఆ పార్టీలో చేరిన కొర్లపాటి చెన్నయ్య, యాదగిరి రాజు, చిరితోటి బ్రహ్మయ్య, బొమ్మల వీరబ్రహ్మయ్య, కూతల ఏసోబు మళ్లీ వైఎస్సార్ సీపీలో చేరారు. వీరికి మంత్రి సురేష్ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వీరితో పాటు పంబా మధుబాబుతో కలిపి మొత్తం 10 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరాయి. మంత్రి సురేష్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో టీడీపీ నాయకులు ప్రజలతో మైండ్ గేమ్ ఆడుతున్నారని, టీడీపీ వారినే మళ్లీ ఆ పార్టీలో చేర్చుకుని వైఎస్సార్ సీపీ వారు టీడీపీలో చేరుతున్నారని అసత్య ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో భాగంగా యానాది సంఘం, ఆంజనేయనగర్, పల్లుపాలెం, అరుంధతి నగర్, అంబేద్కర్ నగర్, పోలేరమ్మ తల్లి గుడి సెంటర్, పటికనేనివారిపాలెంలలో ప్రజలకు మంత్రి సురేష్ ముఖాముఖి నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు సామంతుల రవికుమార్‌రెడ్డి, రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి యన్నాబత్తిన చిన్నా, రాష్ట్ర యువజన విభాగం కార్యదర్శి శీలం రాము, సర్పంచ్ బల్లెకూర బ్రహ్మయ్య, ఎంపీటీసీ ఆదిపోగు సుమతి, వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ యనమల మాధవి, రాష్ట్ర మహిళా విభాగం సంయుక్త కార్యదర్శి రాపూరి ప్రభావతి, పంతగాని నరసింహారావు, ఆదిపోగు యజ్ఞదత్తు, మాదాల నారాయణ, రావినూతల అంకయ్య, బూర్సు మూర్తి, మాదాల శంకర్, ఆదిపోగు మాలకొండయ్య, ఆదిపోగు రాము, కూతల భాస్కర్, బుర్ర బుజ్జి, షేక్ సలీంబాషా పాల్గొన్నారు.


మంత్రి సురేష్‌కు పాస్టర్ల మద్దతు

మంత్రి సురేష్‌కు మద్దతుగా కొండపి నియోజకవర్గ పాస్టర్స్ కమిటీ వారి నాయకత్వంలో శానంపూడిలోని ఇమ్మానియేల్ ప్రార్థన మందిరంలో సుమారు 500 మంది పాస్టర్లు, విశ్వాసులు మంత్రి సురేష్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు.



వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ వర్గీయులు

పరీక్షా సమయం



గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్



ఒంగోలు క్విస్ ఇంజినీరింగ్ కాలేజ్ పరీక్ష కేంద్రం వద్ద గ్రూప్ 2 అభ్యర్థులు

- ప్రశాంతంగా గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష
- జిల్లాలో 49 కేంద్రాల్లో పరీక్ష రాసిన అభ్యర్థులు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ పరమేశ్వరరెడ్డి

ఒంగోలు అర్బన్/ఒంగోలు సబర్బన్: జిల్లాలో ఆదివారం జరిగిన ఏపీపీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్ష ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా ముగిసిందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. పలు పరీక్ష కేంద్రాలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ, ఎస్పీ పరమేశ్వరరెడ్డి విడివిడిగా పరిశీలించారు. పరీక్షలు రాస్తున్న అభ్యర్థులకు కల్పించిన సదుపాయాలు, భద్రతా ఏర్పాట్లు, సీసీ కెమెరాల నిఘా, పోలీసు బందోబస్తు తదితర అంశాలపై పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 49 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్–2 పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి ఎటువంటి సెల్‌ఫోన్‌లు, ఎలక్ట్రానిక్ వస్తువులు అనుమతించలేదన్నారు. పరీక్ష కేంద్రాల్లో ఇంటర్‌నెట్ సైతం నిలిపివేశామన్నారు. జిల్లాలో అన్నీ కేంద్రాల్లో పరీక్ష సమయానికి ప్రారంభమైందని, ఎక్కడా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా సజావుగా నిర్వహించామన్నారు. కలెక్టర్‌తో పాటు రూట్ ఆఫీసర్ పీ వెంకటేశ్వర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఎస్పీ పరమేశ్వరరెడ్డి ఒంగోలు నగరంలోని క్విస్ ఇంజినీరింగ్ కాలేజీ, రైస్ ఇంజినీరింగ్ కాలేజీ, ఏకేవీకే కాలేజీ, నాగార్జున డిగ్రీ కాలేజీ, ఎస్ఎస్ఎన్ కాలేజీల్లో జరుగుతున్న పరీక్షలను స్వయంగా పరిశీలించారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేశామని పేర్కొన్నారు. పరీక్షకు వెళ్లే అభ్యర్థులకు ఎలాంటి ట్రాఫిక్ సమస్యలు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నామన్నారు. పరీక్ష ప్రారంభానికి ముందు మొదలుకొని పరీక్ష పత్రాల తరలింపుతో పాటు పరీక్షల అనంతరం సమాధాన పత్రాలు డిపాజిట్ చేయటానికి అవసరమైన ఎస్కార్ట్ వరకు అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని వెల్లడించారు. కొన్ని పరీక్ష కేంద్రాల వద్ద అదనపు పోలీస్ సిబ్బందిని కేటాయించామన్నారు. ఎస్పీతో పాటు ఇతర విభాగాల అధికారులతో పాటు ఎస్బీ సీఐ కే.రాఘవేంద్ర, ఇతర సిబ్బంది ఉన్నారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం అన్నీ ఏర్పాట్లు చేసింది. తాగునీరు, వైద్య సేవలు అందించేందుకు వైద్య సిబ్బందిని పరీక్ష కేంద్రాల వద్ద ఏర్పాటు చేశారు. వికలాంగులు, గర్భిణులకు ఇబ్బంది లేకుండా వీలైనంత వరకు పరీక్ష కేంద్రాల్లో గ్రౌండ్ ఫ్లోర్‌ను కేటాయించారు. ఒకవేళ మొదటి అంతస్తుకు ఎక్కాల్సి వస్తే పోలీసు సిబ్బంది వారికి సహాయం చేసి ఇబ్బంది లేకుండా పరీక్షా కేంద్రాలకు చేర్చారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ అంతరాయం లేకుండా ముందుగానే జాగ్రత్త చర్యలు చేపట్టారు. చిన్న పిల్లలున్న అభ్యర్థులు పరీక్ష రాస్తున్న సమయంలో అభ్యర్థులకు సంబంధించిన కుటుంబ సభ్యులు పరీక్ష కేంద్రం బయట పాలు పడుతూ వేచి చూశారు. పరీక్ష జరిగే సమయంలో కేంద్రాలకు సమీపంలోని జెరాక్స్ సెంటర్లు, ఇంటర్‌నెట్ సెంటర్లను సైతం మూసివేయించారు. మొత్తం మీద జిల్లాలో గ్రూప్–2 పరీక్షలు ప్రశాంత వాతావరణంలో అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జిల్లా యంత్రాంగం విజయవంతంగా నిర్వహించింది.



ఒంగోలులో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ పరమేశ్వరరెడ్డి



తల్లి పరీక్షకు వెళ్లడంతో బిడ్డను లాలిస్తున్న తండ్రి



బిడ్డను ఎత్తుకొని లైన్‌లో నిల్చొన్న అభ్యర్థి



ఒంగోలులో దివ్యాంగ అభ్యర్థిని చేతులపై ఎత్తుకొని పరీక్ష హాలుకు తీసుకెళ్తున్న పోలీస్



పరీక్ష కేంద్రం వద్ద బోర్డుపై రూం నంబర్లు చూసుకుంటున్న అభ్యర్థులు



చివరి నిమిషంలో పరీక్ష కేంద్రానికి పరిగెడుతున్న అభ్యర్థి



క్విస్ ఇంజినీరింగ్ కాలేజ పరీక్ష కేంద్రం వద్ద క్యూలైన్‌లో నిల్చొని ఉన్న గ్రూప్2 అభ్యర్థులు

క్లుప్తంగా

లారీలు ఢీకొని డ్రైవర్ మృతి



మృతి చెందిన డ్రైవర్ ఖరీద్

ఉలవపాడు: జంక్షన్ వద్ద మలుపు తిరుగుతున్న లారీని మరో లారీ ఢీకొనడంతో ఢీ కొన్న లారీ డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన జాతీయరహదారి పై కరేడు ర్యాంపు వద్ద ఆదివారం జరిగింది. వివరాలు... గుంటూరు నుంచి బొగ్గులోడుతో కరేడు ర్యాంపు వద్ద కంపెనీలోకి మలుపు తిరుగుతున్న సమయంలో చెన్నై నుంచి హైదరాబాద్ వెళుతున్న మరో లారీ ఢీ కొట్టింది, హైదరాబాద్ వెళుతున్న లారీ ముందు భాగం నుజ్జు నుజ్జయింది. డ్రైవర్ మహ్మద్ ఖరీద్ (24) కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే 108 లో ఒంగోలు రిమ్స్ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడు ఉత్తరప్రదేశ్‌లోని సుల్తాన్‌పూర్ జిల్లా మినార్‌పూర్ మండలం మర్మద్‌పూర్ గ్రామానికి చెందిన వ్యక్తి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రిమ్స్‌లోనే ఉంచారు. వారి బంధువులకు సమాచారం అందించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదానికి గురయిన లారీ

సింహ వాహనంపై వేణుగోపాలుడు



వాహనంపై వేణుగోపాలస్వామి

తర్లుపాడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారు సింహవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ వేడుకను చూసేందుకు మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్దఎత్తున హాజరయ్యారు.

కార్యకర్తల రుణం తీర్చుకుంటా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా రాంబాబు



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

● ఎమ్మెల్యే అన్నా రాంబాబు

మార్కాపురం టౌన్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి కార్యకర్తల రుణం తీర్చుకుంటానని మార్కాపురం నియోజకవర్గ సమన్వయకర్త, గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. పట్టణంలోని సెవెన్‌హిల్స్ ఫంక్షన్‌హాలులో ఆదివారం మార్కాపురం మండల నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ హాజరై మాట్లాడుతూ రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత దళితులు ఎన్నో పదవులు అధిరోహించారని ఆర్థికంగా ఎదగడంతో పాటు సామాజిక న్యాయంలో భాగంగా పదవులను ఇచ్చారన్నారు. మన ప్రభుత్వంలో సామాజిక న్యాయంలో భాగంగా అన్నీ వర్గాల వారికి సముచిత న్యాయం దక్కిందని తెలిపారు. ఏపీఐఐసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అన్నారు. అందరూ కలసికట్టుగా పనిచేసి అన్నా రాంబాబు గెలుపునకు కృషి చేయాలన్నారు. గ్రామాల్లోని నాయకుల మధ్య మనస్పర్థలు ఉంటే విడనాడి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరారు. నియోజకవర్గ సమన్వయకర్త అన్నా రాంబాబు మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజారిటీతో తనను గెలిపించాలని, పార్టీ గెలుపే తన గెలుపని ఆయన తెలిపారు. కష్టపడిన కార్యకర్తలను గుర్తించుకొని నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తానని అన్నారు. ఈ 50 రోజులు ప్రతి ఒక్క కార్యకర్త ప్రతిపక్షాలు మన పార్టీపై చేసే కుట్రలను తిప్పికొట్టాల్సిన సమయం ఆసన్నమైందని, ప్రతి ఒక్క కార్యకర్త అనునిత్యం పార్టీ గెలుపునకు ఒక సైనికుడిలా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ మీర్జా షంషేర్ ఆలీబేగ్, జెడ్పీటీసీ నారు బాపన్‌రెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ గొలమారు శ్రీనివాసరెడ్డి, మార్కాపురం మండల సీనియర్ నాయకులు కుందురు చిన్నకొండారెడ్డి, నాయకులు బట్టగిరి తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ పోరెడ్డి అరుణా చెంచిరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గుంటక శ్రీనివాసరెడ్డి, బండి కృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ జవ్వాజి రంగారెడ్డి, పొందుగుల శ్రీనివాసరెడ్డి, మండలంలోని అన్నీ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, ఏఎంసీ డైరెక్టర్ పీఎల్‌పి యాదవ్ పాల్గొన్నారు. అనంతరం ఏపీఐఐసీ చైర్మన్ జంకె వెంకటరెడ్డి, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు మాదిగ, మార్కాపురం సమన్వయకర్త అన్నా వెంకటరాంబాబులను గజమాలతో సన్మానించారు.

జగనన్న పాలన సంక్షేమ రాజ్యం



మాట్లాడుతున్న డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్, వేదికపై పీడీసీసీబీ చైర్మన్ బన్నీ, జెడ్పీటీసీ కస్తూరిరెడ్డి



గుడిలో పూజలు చేస్తున్న పార్టీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్

- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో బడుగు వర్గాలకు పెద్దపీట
- అబద్ధాల చంద్రబాబును నమ్మొద్దు
- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్

కనిగిరి రూరల్: జగనన్న పాలనలో రాష్ట్రం సంక్షేమంగా ఉందని.. అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మండలంలోని తాళ్లూరులో వీరబ్రహ్మేంద్ర స్వామి తిరునాళ్ల ఉత్సవం శనివారం రాత్రి అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభ వేదికపై మూలే మాలకొండారెడ్డి, కోటిరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమం పార్టీ నియోజకవర్గ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలోనే బడుగు బలహీన వర్గాలకు పెద్ద పీట వేశారన్నారు. కనిగిరి నియోజకవర్గంలో మూడు సార్లు బీసీకి సీటు కేటాయించి సామాజిక సాధికారతకు దర్పణంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారని కొనియాడారు. సామాన్య కార్యకర్తనైన తనకు ఉన్నత స్థానం కల్పించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, మాజీ మంత్రి ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసులరెడ్డికి తాను ఎల్లప్పుడు రుణపడి ఉంటానన్నారు. జగనన్న ఆశీస్సులతో వాసన్న దీవెలతో మీముందుకు వచ్చానని మంచి మనస్సుతో ఆదరించాలన్నారు. నేను మీలో ఒకడినని.. ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ప్రతి కార్యకర్త తనను కలవవచ్చని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే జగనన్న మళ్లీ సీఎం కావాలని చెప్పారు. వెలిగొండ జలాలకు కనిగిరి శివారు ప్రాంతాలతో పాటు, పీసీపల్లి మండలంలోని అన్ని గ్రామాలకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎంకు విన్నవించినట్లు వెల్లడించినట్లు చెప్పారు.

అబద్ధాల చంద్రబాబును నమ్మొద్దో...

అబద్ధాల చంద్రబాబును నమ్మి మోసపోవద్దన్నారు. 14 ఏళ్ల చంద్రబాబు పాలనలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశాడని తీవ్రంగా మండిపడ్డారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రజా సమస్యలను పట్టించుకోని చంద్రబాబు.. ఇప్పుడు కల్లిబొల్లి మాటలతో ప్రజల్లోకి వస్తున్నాడని తీవ్రంగా దుయ్యబట్టారు. టీడీపీ పాలనంతా దోచుకో... దాచుకో... పంచుకో.. తప్ప అభివృద్ధి ఊసే లేదన్నారు. గత ప్రభుత్వంలో పచ్చ చొక్కాల వారికే సంక్షేమ ఫలాలు దక్కేవన్నారు. కానీ నేటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అర్హతే ప్రమాణికంగా జల్లెడపట్టి మరీ సంక్షేమ పథకాలను అందచేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో పీడీసీసీబీ చైర్మన్ వైఎం ప్రసాద్‌రెడ్డి, జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్ మోహన్‌రెడ్డి, మూలే ఈశ్వరమ్మ, మార్తాల వెంకటేశ్వరరెడ్డి, సంగన గురుబ్రహ్మారెడ్డి, రామిరెడ్డి, కోటిరెడ్డి దాదిరెడ్డి మాలకొండారెడ్డి, సర్పంచ్‌లు నాగేంద్రారెడ్డి, ఏడుకొండలురెడ్డి, మూలే గోవిందారెడ్డి, ముద్దా బాబు, పలుకూరి భాస్కర్, పెన్నా ఏడుకొండలు, కృష్ణారెడ్డి, చింతం శ్రీను, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని బల్లిపల్లి పంచాయతీలో అంకాళమ్మ గుడిలో ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో దానకర్‌రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, సైకం శివారెడ్డి, ముత్తుముల మాలకొండారెడ్డి, జిల్లె రఘురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం



ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి మోమెంటో అందజేస్తున్న వైఎస్సార్ ఐటీ వింగ్ సభ్యులు



మాట్లాడుతున్న గిద్దలూరు ఇన్‌చార్జి, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

- ప్రజల వద్దకు పాలన అందించిన నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి
- వైఎస్సార్ సీపీ గిద్దలూరు ఇన్‌చార్జి, ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- నాగోలులో గిద్దలూరు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం

నాగోలు: దేశంలో ఏ రాష్ట్రంలో అమలు కానీ సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నాయకత్వంలో అమలవుతున్నాయని, జగనన్న ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్, మార్కాపురం ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి అన్నారు. గిద్దలూరు నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఎల్‌బీనగర్ నియోజకవర్గం నాగోలులో అనంతుల ధర్మారెడ్డి గార్డెన్‌లో వైఎస్సార్ ఐటీ వింగ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కేపీ నాగార్జునరెడ్డి మాట్లాడుతూ ప్రజలకు వద్దకు పాలన అందించిన నాయకుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన 100 శాతం అమలు చేసిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందని తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందడమే కాకుండా, ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు చేరువ అయ్యాయన్నారు. మాట తప్పని, మడమ తిప్పని నేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని సీఎం చేయాలని కోరారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలకు సేవ చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇక్కడి పంపించారని తెలిపారు. తాను మార్కాపురం ఎమ్మెల్యేగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండి గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పూర్తి చేశామని తెలిపారు. ఇప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయని మరో 40 పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న నియోజకవర్గ ప్రజలు గత ఎన్నికల్లో మాదిరిగా సమన్వయంతో పనిచేసి ఇక్కడ ఉన్న వారిని తీసుకు వచ్చి ఓట్లు వేయించాలని కోరారు. గిద్దలూరు నియోజకవర్గ ప్రజలు తనను ఆశీర్వదించాలని 365 రోజులు నిత్యం ప్రజలకు అందుబాటులో సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గిద్దలూరు నియోజకవర్గ ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. నియోజకవర్గ ప్రజల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ ఐటీ వింగ్ అధ్యక్షుడు సునీల్‌రెడ్డి మాట్లాడుతూ ఏపీలో వైఎస్సార్ సీపీపై ప్రతిపక్ష పార్టీలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని అది మనం తిప్పి కొట్టాలని సూచించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు వివరించాల్సిన అవసరం మనపై ఉందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో గిద్దలూరులో నాగార్జునరెడ్డితో పాటు ఇతర ప్రాంతంలో వైఎస్సార్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిద్దలూరు ఎంపీపీ కడప వంశీధర్‌రెడ్డి, ఏపీ ఎంఎస్ఎంఈ డైరెక్టర్ బద్రీనాథ్, రాచర్ల జెడ్పీటీసీ వెంకట్ నాయుడు, మాజీ జెడ్పీటీసీ ప్రవీణ్‌కుమార్, సీఆర్ఐ మురళీ, సీహెచ్ రమణారెడ్డి, గిద్దలూరు మాజీ సర్పంచ్ సురేందర్, మధుసూదన్‌తో నగరంలో ఉంటున్న వివిధ వర్గాల ప్రజలు పాల్గొన్నారు.

సజీవ నదిలా పారే వేమన పద్యాలు



చిన్నారులతో కథలు చదివిస్తున్న దృశ్యం

ఒంగోలు టౌన్: వందల ఏళ్లుగా ప్రజల నోళ్లలో నానుతున్న వేమన పద్యాలు తెలుగు నేల మీద సజీవ నదిలా పారుతూనే ఉన్నాయని విశ్రాంత ప్రిన్సిపాల్ ఐ.నరసింహం అన్నారు. ఆదివారం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమన శతకం పుస్తకాన్ని ఆవిష్కరించి చిన్నారులకు వేమన పద్యాలను పరిచయం చేశారు. తెలుగు భాషాభివృద్ధికి వేమన పద్యాలు ఎంతగానో దోహదం చేస్తాయని, చిన్నారులలో శాస్త్రీయ ఆలోచనలు పెంపొందిస్తాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు వేమన పద్యాలు నేర్పించాలని సూచించారు. అనంతరం ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ పి.పేరయ్య, రచయిత మంచికంటి వెంకటేశ్వరరెడ్డి చిన్నారులకు కథలు చదివి వినిపించారు. అందులోని నీతిని విడమర్చి చెప్పి జీవితంలో నైతిక విలువలు పాటించాలని సూచించారు. అలాగే చిన్నారులతో కథలు చదివించారు. ఉపగ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డీహెచ్‌పీ కరవది సుబ్బారావు, సామాజిక కార్యకర్త నున్నా అంజనేయులు, గాయకులు బి.మల్లికార్జునరావు, ఆర్.ఉదయకుమార్, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చీటీపాటల పేరుతో మోసం

బేస్తవారిపేట: బేస్తవారిపేట పట్టణంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఐతా కిశోర్‌కుమార్ చీటీపాటలు వేసి డబ్బు తిరిగి ఇవ్వకుండా మోసం చేసి పరారైనట్లు పలువురు బాధితులు బేస్తవారిపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్సై నరసింహారావు తెలిపిన వివరాల ప్రకారం.. ఇప్పటివరకు రూ.70 లక్షల వరకు మోసం జరిగినట్లు చీటీపాటల బాధితుల నుంచి ఫిర్యాదు అందినట్లు తెలిపారు. ఇంకా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రూ.5 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు చీటీపాటల డబ్బులను పాట ముగిసిన తర్వాత ఇవ్వకుండా బాండ్‌లు ఇవ్వడం చేస్తూ వచ్చాడన్నారు. సొంతిల్లు కూడా అమ్మేసి రాత్రికి రాత్రి పరారవ్వడంతో బాధితులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. మొత్తం అప్పు రూ.5 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు ఉంటుందని బాధితులు అంచనా వేస్తున్నారు.

అదే బాటలో మరొకరు..

బేస్తవారిపేటలోని లలితాంబికా ఆలయ సమీపంలో నివాసం ఉండే కే శ్రీనివాసులు చీటీపాటల డబ్బులు, పోస్టాఫీసు ఆర్డీల నగదు చెల్లించకుండా మోసం చేసి పరారయ్యాడు. పేదల వద్ద నెలవారీగా పోస్టాఫీసులో ఆర్డీ కోసమని తీసుకున్న నగదును పోస్టాఫీసులో జమ చేయలేదు. రూ.50 వేల నుంచి రూ.2 లక్షల చీటీల పేరుతో కూలి పనులు, చిన్నపాటి దుకాణాలు నిర్వహించుకునే వారి వద్ద డబ్బు వసూలు చేశాడు. ఇంటిని అమ్మేసి రాత్రికిరాత్రి గృహంలోని సామానుతో పరారయ్యాడు. ఇతనిపై పోలీస్‌స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేస్తున్నారు. దాదాపు రూ.2 కోట్లకు ముంచి పరారైనట్లు ప్రాథమికంగా అంచనా వేస్తున్నారు.

బ్రెయిన్ స్ట్రోక్‌తో ఆర్మీ జవాన్ మృతి



జాతీయ పతాకంతో అలీఅక్బర్‌కు నివాళులర్పిస్తున్న ఆర్మీ అధికారులు



కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకుడు కామూరి రమణారెడ్డి

కొమరోలు: విధి నిర్వహణలో ఉన్న ఓ ఆర్మీజవాన్ బ్రెయిన్ స్ట్రోక్‌తో శనివారం మృతిచెందాడు. ఈ సంఘటన పూణెలోని ఆర్మీ క్యాంప్‌లో చోటుచేసుకుంది. మండలంలోని అల్లినగరం గ్రామానికి చెందిన షేక్ అలీఅక్బర్ (34) పూణెలోని ఆర్మీ క్యాంప్‌లో విధులు నిర్వహిస్తున్న సమయంలో బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతని మృతదేహాన్ని ప్రత్యేక వాహనంలో స్వగ్రామమైన అల్లినగరంకు ఆదివారం తీసుకొచ్చారు. గిద్దలూరు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకుడు కామూరి రమణారెడ్డి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. అలీఅక్బర్‌కు భార్య, ఇద్దరు కూతుర్లు, ఒక కుమారుడు ఉన్నారు. 14 సంవత్సరాల 8 నెలలుగా ఆర్మీలో విధులు నిర్వహిస్తున్నారు. అల్లినగరంలోని శ్మశాన వాటికలో ఆదివారం ఆర్మీ అధికారులు అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

టిఫిన్ హోటల్లో అగ్ని ప్రమాదం

- సిలిండర్ లీక్ కావడంతో చెలరేగిన మంటలు
- కస్టమర్లు పరుగులు తీయడంతో తప్పిన ప్రాణ నష్టం



సంఘటన స్థలంలో గుమిగూడిన ప్రజలు

పెద్దదోర్నాల: ఓ టిఫిన్ హోటల్లో గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో మంటలు చెలరేగి కొంత మేర ఆస్తి నష్టం సంభవించింది. ఈ సంఘటన మండల కేంద్రంలోని గుంటూరు రోడ్డులో ఉన్న ఐడియా షోరూం ఎదురుగా ఓ హోటల్లో చోటుచేసుకుంది. ఉదయం 8 గంటలకే చోటుచేసుకోవడంతో హోటల్లోని అధిక సంఖ్యలో ఉన్న కస్టమర్లు బయటకు పరుగులు తీశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఆ సమయంలో ఓ బాండీలో పూరీల కోసం కాగుతున్న నూనె కూడా ఉంది. గ్యాస్ సిలిండర్ లీక్ కావడంతో పాటు పూరీ బాండీకి సైతం మంటలు అంటుకుని చెలరేగాయి. దీంతో ఒక్కసారిగా భయానక వాతావరణం నెలకొంది. మంటలు భారీగా వ్యాపించి గ్యాస్ సిలిండర్ పేలుతుందేమోనన్న భయంతో అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా, అధికారి విలియమ్స్ ఆధ్వర్యంలో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో రూ.20 వేల నగదు, రూ.15 వేల విలువైన వస్తువులు అగ్నికి అహుతైనట్లు అగ్నిమాపక శాఖాధికారి విలియమ్స్ పేర్కొన్నారు. చిన్న హోటల్ నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుండగా, అగ్ని ప్రమాదంతో జీవనాధారాన్ని కోల్పోయానని హోటల్ యజమాని కృష్ణానాయక్ వాపోయాడు.

చెప్పింది చేయకపోవడమే చంద్రబాబు నైజం



భారీ గజమాలతో బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డిలకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

● మాజీ ఎమ్మెల్యే, దర్శి ఇన్‌చార్జి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి



భారీగా హాజరైన గ్రామస్తులు

దర్శి: రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గల్లంతు కావడం ఖాయమని, వైఎస్సార్ సీపీ 175 స్థానాలను కైవసం చేసుకుంటుందని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని బసిరెడ్డిపల్లె, లింగన్నపాలెం గ్రామాల్లో ఆదివారం రాత్రి మన ఊరు మన శివన్న కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి ఆయన సతీమణి నందినిలకు నాయకులకు భారీ గజమాల వేసి స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి పూలు జల్లుతూ గ్రామంలోకి సాదరంగా ఆహ్వానించారు. డీజే శబ్దాలు, డప్పు వాయిద్యాలతో గ్రామాలు దద్దరిల్లాయి. ఈ సందర్భంగా శివప్రసాదరెడ్డి మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి మీకు మేలు జరిగితేనే ఓటు వేయండని అడిగే దమ్మున్న నాయకుడు దేశ చరిత్రలో ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకునే చంద్రబాబు మూడు జెండాలు పట్టుకొని మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు బయలుదేరాడని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చెప్పింది చేయకపోవడమే చంద్రబాబు నైజమని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండటమే జగనన్న నైజమని చెప్పారు. జిల్లా పరిషత్‌చైర్ పర్సన్‌బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఆనాడు వైఎస్ రాజశేఖరరెడ్డి, నేడు వైఎస్ జగన్‌మోహనరెడ్డి పాలనలోనే వానలు సకాలంలో పడి రైతులు సుభిక్షంగా ఉన్నారన్నారు. తండ్రి బూచేపల్లి సుబ్బారెడ్డి కోరిక మేరకు తన కుమారుడు బూచేపల్లి శివప్రసాదరెడ్డిని పేదలకు వైద్య సేవలు చేయాలని డాక్టర్‌ని చేయించామని చెప్పారు. అయితే తండ్రి బాటలో రాజకీయంగా మరింత సేవలు చేసేందుకు అవకాశముంటుందని రాజకీయంలోకి వచ్చారన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి శివప్రసాద్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ వెన్నపూస వెంకటరెడ్డి, ఎంపీపీ సుధా అచ్చయ్య, పట్టణ అధ్యక్షుడు కట్టికోట హరీష్, గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ డైరెక్టర్ కె.అంజిరెడ్డి, మండల ఉపాధ్యక్షుడు ముసలయ్య, సోము దుర్గారెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు రాంభూపాల్‌రెడ్డి, నెడ్‌క్యాప్ డైరెక్టర్ ఎస్ తిరుపతిరెడ్డి, రహంతుల్లా, మాజీ సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఎంపీటీసీల సంఘ జిల్లా అధ్యక్షుడు బి.గోపాల్‌రెడ్డి, కె.శ్రీనివాసరెడ్డి, కె.ప్రసాదరెడ్డి, కె.కోటిరెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ఎం బాషా, కాపా రమణారెడ్డి, మాజీ ఎంపీపీ ఇత్తడి దేవదానం, బీసీ ప్రధానకార్యదర్శి పి.జయసింహారావు, మాజీ ఏఎంసీ చైర్మన్ కేవిరెడ్డి, ఎం మోహనరెడ్డి, ఏ జ్యోతి శివారెడ్డి, రవి, నరసింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.